క్లుప్తంగా

జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో జాదవ్ పరశురామ్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో జాదవ్ పరశురామ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతులను ఆయన పరిశీలించి ప్రస్తుతం కొనసాగుతున్న సిలబస్ గురించి విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాల నుంచి స్వయంగా నోట్స్ తయారు చేసుకునేలా అలవాటు చేసుకోవాలన్నారు. సైన్స్ విద్యార్థులు ఇప్పటి నుంచే ఎంసెట్, నీట్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు, టీచింగ్ డైరీ, విద్యార్థుల హాజరుశాతం పరిశీలించారు. సిబ్బంది రికార్డుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు ఉన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి



విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. గోల్కొండ కోట, ఖిలాషాపురం కోటను ఏలిన ఏకైక బహుజన వీరుడు పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, భూమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, గౌడ సంఘం నాయకులు వెంకటేశ్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ఏ.మురళీగౌడ్, జి.దేవేందర్‌గౌడ్, ఏ.దేవేందర్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ మఖ్దూమ్, నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేస్తాం..!



మాట్లాడుతున్న రమాదేవి

కుంటాల: ముధోల్ బీజేపీ టికెట్ ఎవరికి వచ్చినా ఆ అభ్యర్థి గెలుపు కోసం కలిసి పనిచేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్, బోస్లే మోహన్ రావు స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నయాగావ్ ఎమ్మెల్యే రాజేశ్‌పవార్ ఆధ్వర్యంలో కుంటాలలో శుక్రవారం నిర్వహించిన అసెంబ్లీ ప్రవాస ప్రయోజన కార్యక్రమంలో నేతలు మాట్లాడారు. అధిష్టానం నిర్ణయాన్ని అందరం శిరసా వహిస్తామని తెలిపారు.

యువతకు ప్రాధాన్యత కల్పించాలి

ఖానాపూర్: కాంగ్రెస్ అధిష్టానం యువతను గుర్తించి ప్రాధాన్యత కల్పించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్ నాయక్ కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు. ప్రజాసమస్యలపై గత కొన్నేళ్లుగా నిరంతర పోరాటం చేస్తున్నానని తెలిపారు. శ్యాంమోహన్‌రావు, మడిగెల అనిల్, డింపుల్, సురేందర్, సిద్ధూ, సాయిరాం, రాకేశ్, వినయ్, నవీన్, మహేశ్, విజయ్ ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

మామడ: 'గృహలక్ష్మి' పథకానికి వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక అధికారులు పరిశీలిస్తున్నారు. మండలంలోని పొన్కల్‌లో శుక్రవారం ఎంపీవో గోవర్ధన్, న్యూసాంగ్విలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, తోటిగూడలో దరఖాస్తులను ఈజీఎస్ ఏపీవో శివాజీ పరిశీలించారు.

లోకేశ్వరం: మండలంలోని జోహార్‌పూర్‌లో 'గృహలక్ష్మి' దరఖాస్తుదారుల వివరాలను తహసీల్దార్ మోతీరాం అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ బాలకిషన్ ఉన్నారు.

కడెం: మండలంలోని మారుమూల పాలరేగడి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్య గృహలక్ష్మి సర్వే నిర్వహించారు. ఈ పథకానికి అర్హులను గుర్తించారు.

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం దర్యాపూర్‌లో ఏవో జాదవ్ సాయికిరణ్ శుక్రవారం గృహలక్ష్మి సర్వే చేపట్టారు. కార్యదర్శి నవనీత్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

నిర్మల్‌చైన్‌గేట్/భైంసారూరల్/లక్ష్మణచాంద/ముధోల్/కుంటాల/దిలావర్‌పూర్/ఖానాపూర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. ఇళ్లల్లో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ పాఠశాలలు, పలుచోట్ల జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



భైంసాలోని సరస్వతీ శిశు మందిర్‌లో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



ఖానాపూర్: వ్రతంలో పాల్గొన్న మహిళలు



నిర్మల్‌చైన్‌గేట్: పూజలు చేస్తూ..



భైంసాలోని సరస్వతీ శిశు మందిర్‌లో..

దరఖాస్తు చేసుకోండి

ముధోల్: ముధోల్‌కు ఇటీవల మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. సుధాకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం ఆయన భవనాన్ని పరిశీలించారు. అడ్మిషన్ కాని వారు దోస్త్ స్పెషల్‌డ్రైవ్ ద్వారా రూ.400 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

సోన్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శివరాజ్ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై శుక్రవారం బీఎల్‌వో, సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీల్లో, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక కాంపెయిన్ నిర్వహిస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భైంసారూరల్: భైంసాలోని వినాయక్‌నగర్‌లో హనుమాన్ ఆలయ నూతన కమిటీ శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా శరద్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, గౌరవ సలహాదారుగా గంగాచరణ్, ధర్మారావ్, హన్మండ్లు, రాములుగౌడ్, గౌరవ సభ్యులుగా నర్సింగ్ రావ్, నారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెంబి: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహిస్తున్న రెండవ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కొనసాగుతోంది. మండలంలోని 24 పంచాయతీ పరిధిలో 2020–23 ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్ల 45లక్షల ఖర్చు సంబంధించిన వివరాలను ప్రజావేదిక ద్వారా డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం వివరించారు. మండలంలోని కిషునాయక్ తండా గ్రామంలో చనిపోయిన వ్యక్తిపై పనిచేసినట్లు వేతనం చెల్లించారు. వివాహమై అత్తారింటికి వెళ్లిన మహిళ పేరున మస్టర్‌లో సంతకాలు పెట్టి వేతనం చెల్లించినట్లు గుర్తించారు. దుబాయ్ వెళ్లిన వ్యక్తికి, ఆర్టీసీ డ్రైవర్ పని చేసినట్లు మస్టర్‌లో సంతకాలు చేయడమే కాకుండా వేతనాలు చెల్లించారని తనిఖీ బృందంవెల్లడించింది. ఇప్పటి వరకు 15 గ్రామాలకు సంబంధించిన వెల్లడించినట్లు తెలిపారు. ఎంపీపీ కవిత, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సామాజిక తనిఖీ బృందం, సర్పంచ్‌లు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి

రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలి

తానూరు: మహిళలు ఐకేపీ ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.మంగళ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రుణాలు పొంది వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. 2022–23 సంవత్సరం లావాదేవిలు, మిగులు లోటు, ప్రణాళికలపై చర్చించారు. ఐకేపీ ఏపీఎం నారాయణ్‌రెడ్డి, సీబీవో పోశెట్టి, సీసీలు భోజన్న, సాయినాథ్, సరిత, హైదర్, దత్తాత్రి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య పాలకవర్గ సభ్యుల ఎన్నిక

మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.మంగళ, ఉపాధ్యక్షురాలిగా పోశాని, కార్యదర్శిగా పద్మ, సహాయ కార్యదర్శిగా ఎం.వైశాలి, కోశాధికారిగా రేణుక ఎన్నికయ్యారు, ఆయా గ్రామాల సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంగళ

జాన్సన్‌నాయక్ కలిసిన నాయకులు

కడెం: బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్‌ను శుక్రవారం ఆయన నివాసంలో ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముడికే మల్లేశ్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన గంగాధర్, సత్తెన్న, జగన్, రాజేందర్, రాజేశ్‌నాయక్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఖానాపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ పట్టణానికి చెందిన కౌన్సిలర్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, అమానుల్లా ఖాన్, జన్నారపు శంకర్, తొంటి శ్రీనివాస్, పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా ఉన్నారు.



కడెం: జాన్సన్ నాయక్‌తో నాయకులు, తదితరులు

దస్తురాబాద్: తెలంగాణ ఉద్యమకారులను మరువలేనని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని భూత్కూర్, మున్యాల గ్రామాలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో శుక్రవారం చేరారు. ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

సారంగపూర్: రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతీ వ్యక్తి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని నిర్మల్ డీ ఎస్పీ గంగారెడ్డి అన్నారు. మండలంలోని బీరవెల్లి గ్రామంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 130 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చే సుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. మట్కా జూదం ఆడినా, నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ట్రాఫిక్ రూల్స్ పాటించే వారిని సత్కరించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బీరవెల్లిలో సన్మానిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

'బీసీబంధు' ఇవ్వాలి

భైంసారూరల్: కులవృత్తులందరికీ బీసీ బంధు ఇవ్వాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం భైంసాలో ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకుడు సంకెట మహేశ్‌బాబు మాట్లాడుతూ గతంలో రుణాలు తీసుకున్న వారికి మళ్లీ రూ.లక్ష చెక్కులు ఇవ్వడం సరైందని కాదన్నారు. దరఖాస్తులు చేసుకున్న అందరికి ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు.

తానూరు: అర్హులందరికీ 'బీసీ బంధు' ఇవ్వాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో లబ్ధిదారులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామాల్లో ఒకరికి మాత్రమే బీసీ బంధు అమలు చేయడం సరికాదన్నారు. నాయకులు సాయినాథ్, యోగేశ్ తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

లక్ష్మణచాంద: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కల నెరవేరుస్తామని, ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్లు మంజూరు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు తెలిపారు. వస్తున్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాబాపూర్, కంజర్, నర్సాపూర్, కాశీగూడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర పథకాలను ఎండగడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన సొంత గ్రామమైన ఎల్లపెల్లిలో తప్ప లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్, కంజర్, నర్సాపూర్, కాశిగూడ గ్రామాల్లో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే అని ధీమా వ్యక్తం చేశారు. సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తామని రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని, వంటగ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని వివరించారు. రైతుబంధు సాయం రూ.12 వేలకు పెంచుతామని తెలిపారు. కౌలు రైతులకు కూడా రైతుబీమా వర్తింపజేస్తామన్నారు. ఆయన వెంట సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు చిన్ను, ఈటల శ్రీనివాస్, ఒడ్నాల రాజేశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



:బాబాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

గోమాతకు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంలు శుక్రవారం గోమాతకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పక్షం రోజుల నుంచి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ అవుతామనే ఆశతో చాలీచాలని వేతనాలతో 20 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి మాత్రం చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ శ్రమను, సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.



గోమాతకు వినతిపత్రం అందజేస్తున్న రెండవ ఏఎన్ఎంలు

బీజేపీతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి

- ముఖ్కేడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్

పెంబి: బీజేపీతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మహారాష్ట్రలోని ముఖ్కేడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్, మాజీ ఆదిలాబాద్ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ అసెంబ్లీ ప్రవాస్ యోజన సమావేశానికి తుషార్ రాథోడ్ హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. పెంబి మండలంలో రోడ్డు సౌకర్యాలు లేవని, కడెం, దోత్తి వాగులపై వంతెనలు లేవని, నిర్మించిన చోట వరద ఉధృతికి కొట్టుకుపోయిందని పెంబి జెడ్పీటీసీ జానుబాయి.. ఎమ్మెల్యే తుషార్ రాథోడ్‌కు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు సదాశివ్, నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు రాజు, గిరి తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తుషార్ రాథోడ్

దస్తురాబాద్: బీజేపీ బలోపేతానికి కార్యకర్త కృషి చేయాలని మహారాష్ట్రలోని ముఖ్కేడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఆయన హాజరై కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. అందరూ సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకలు రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, జిల్లా, మండల పదాధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- నయాగావ్ ఎమ్మెల్యే రాజేష్ పవార్

కుంటాల: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని మహారాష్ట్రలోని నయాగావ్ ఎమ్మెల్యే సంభాజీ రాజేష్ పవార్ జోస్యం చెప్పారు. కుంటాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీ ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్ పవార్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు లేవన్నారు. ఇంటికో ఉద్యోగమని చెప్పి, దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. అనంతరం శ్రీ గజ్జలమ్మ, ఉమామహేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తర్వాత బస్తీ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా సహపంక్తి భోజనాలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్, బోస్లే మోహన్‌రావు పటేల్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, ఎంపీపీ గజ్జారాం యాదవ్, మండల కన్వీనర్ నర్సయ్య, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, కోఆప్షన్ మెంబర్ గౌస్, ఎంపీటీసీ రవి, జిల్లా నాయకులు రవి పాండే, నారాయణరెడ్డి, బి.గంగాధర్, తాటి శివ, కె.గజేందర్, జక్కుల గజేందర్, బాజీరావు పటేల్, లక్ష్మణ్ పటేల్, దిగంబర్ పటేల్, చంద్రకాంత్ పటేల్, అశోక్ కుమార్, ఆసిఫ్ ఖాన్, ప్రణయ్‌రావు, దత్తు పటేల్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్ పవార్

వీఆర్ఏల సర్దుబాటుపై పునరాలోచన చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: వీఆర్ఏల సర్దుబాటుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, జిల్లా కార్యదర్శి హరిత అన్నారు. వీఆర్ఏ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో కనీస భద్రత లేని డిపార్ట్‌మెంట్‌లో వీఆర్ఏలను సర్దుబాటు చేయడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉద్యోగుల సర్వీసు(సీనియర్టీ)ను ఎక్కడా పరిగణనలోకి తీసుకోక పోవడంతో తమ సీనియారిటీ లేకుండా పోతుందన్నారు. వీఆర్ఏల ర్యాండమైజేషన్‌తో సీనియర్ వీఆర్ఏలకు అన్యాయం జరిగిందన్నారు. మిషన్ భగీరథ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సర్దుబాటు చేసిన వారిని ఇతర శాఖలకు కేటాయించాలన్నారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, నువ్వుల రాజన్న, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లనర్సయ్య, రాజన్న, భీమరాజు, రాజమౌళి, కాల్వ పోశం, భూమన్న, రాధ, షేక్ అబ్దుల్, భూమేష్, గంగాధర్, పి.ముత్యం, క్యాతం ఆశన్న, ఎం.రవళి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

వాహనాల తనిఖీ

ముధోల్: ముధోల్‌లోని భైంసా-నిజామాబాద్ రహదారిపై సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట వాహన పత్రాలు తెచ్చుకోవాలన్నారు. ఎస్సై సాయికిరణ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ముధోల్: ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సీఎం కేసీఆర్ అసెంబ్లీ టికెట్ ఖరారు చేయడం తెలిసిందే. బీఆర్ఎస్ నేతలు శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో గజమాలతో సన్మానించారు. మళ్లీ మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తామని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ పోతన్నయాదవ్, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మాఖ్దూమ్, నాయకులు మోహన్ యాదవ్, నితిన్‌గౌడ్, సాయిబాబా ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

కుంటాల: ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని ఆయన నివాసంలో పలువురు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం కలిసి గజమాలతో సన్మానించారు. పార్టీ మండల కన్వీనర్ దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శంకర్ గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కుంటాల: స్వాతంత్ర్య భారత వజ్రోత్సవ కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కుంటాలకు శనివారం రానున్నట్లు డీఆర్‌ఓ రేష్మ, ఎఫ్‌బీవో స్రవంతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుంటాల అటవీ ప్రాంతంలో ఎమ్మెల్యే మొక్కలు నాటుతారని తెలిపారు.

రాజేష్‌బాబు అనుచరుల సంబరాలు

లోకేశ్వరం: హైదరాబాద్‌లో జరిగిన ఘటనపై భైంసా ఏఎంసీ చైర్మన్ జాదవ్ రాజేష్‌బాబుకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్షమాపణ చెప్పారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తా వద్ద రాజేష్‌బాబు అనుచరులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. గిరిజన నాయకులు సురేష్‌బాబు, కోటేష్‌బాబు, ఉత్తమ్ ఉన్నారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో మన్మద్, పుస్పూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ శుక్రవారం బీసీబంధు చెక్కులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గంగారెడ్డి కుమారుడు వివాహం గురువారం జరిగింది. రాష్ట్రమంత్రి ఐకే రెడ్డి శుక్రవారం గంగారెడ్డి ఇంటికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ఉన్నారు.

ఇస్రోకు అభినందనలు

ఖానాపూర్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం పలు ప్రదర్శనలు చేశారు. ఇస్రోకు అభినందనలు తెలియజేస్తూ ఇస్రో ఆకారంలో ఉండి ప్రదర్శన చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: ఆశకార్యకర్తలకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆశవర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశలు పని ఒత్తిడి తట్టుకొని సేవలందించారని గుర్తుచేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగమణి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

లక్ష్మణచాంద: కనకాపూర్‌కు చెందిన పలువురు యువకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో వారికి పార్టీ కండువా కప్పారు. రాజేశ్వర్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్, రవి ఉన్నారు.

రేపు వర్షావాజ్

తానూరు: మండలంలోని వడ్గాం గ్రామంలో ఆదివారం వర్షావాజ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల నుంచి భారతీయ బౌద్ధమహాసభ నాయకులు హాజరుకావాలని కోరారు.